ఆర్థిక సంఘం నిధులకు మోక్షమెప్పుడో?

- ఏడాదిగా విడుదల కాని 15వ ఆర్థిక సంఘం నిధులు
- గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి
- ఆర్థిక సంఘం నిధుల కోసం ఎదురు చూపులు



ప్యాపిలి గ్రామ పంచాయతీ కార్యాలయం

ప్యాపిలి: దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలు అన్నారు జాతిపిత మహాత్మాగాంధీ. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందినట్లు. అయితే గ్రామాల అభివృద్ధి విషయంలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండడంతో వాటి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎలా నిర్వహించాలని అధికారులు, సర్పంచ్‌లు తలలు పట్టుకుంటున్నారు. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలంలో 31 గ్రామ పంచాయతీలు, బేతంచెర్ల మండలంలో 19 గ్రామ పంచాయతీలు, డోన్ మండలంలో 26 పంచాయతీలు ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులో తొలి విడత నిధులు విడుదల చేసింది. ఈ ఏడాది మార్చిలో విడుదల కావాల్సిన రెండో విడత నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు. మేజర్ పంచాయతీలకు పలు రకాల ఆదాయ వనరులు ఉండడంతో ఎలాగోలా నెట్టుకువస్తున్నారు. మైనర్ పంచాయతీలకు ఆదాయ వనరులు లేకపోవడంతో వాటి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మైనర్ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో వీధిలైట్లు అమర్చాలన్నా.. బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నా.. సిబ్బందికి జీతాలు చెల్లించాలన్నా 15వ ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారపడాల్సి వస్తుంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో సర్పంచ్‌లు సొంత నిధులు ఖర్చు చేస్తూ అప్పుల పాలవుతున్నారు.

స్థానిక సంస్థలపై చిన్నచూపు

ప్రభుత్వం స్థానిక సంస్థలపై చిన్నచూపు చూస్తోంది. దీంతో నియోజకవర్గంలోని 76 గ్రామ పంచాయతీలకు మూడు మండల పరిషత్‌లకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. గ్రామ సర్పంచ్‌లు, మండల అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడం వల్లనే ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేయడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏడాదిగా అందని నిధులు

15వ ఆర్థిక సంఘం నిధులు గత ఏడాది కాలంగా అందడం లేదని సర్పంచ్‌ల వాపోతున్నారు. టైడ్, బేసిక్ గ్రాంట్ల రూపంలో నిధులు విడుదల కావాల్సి ఉంది. టైడ్ కింద విడుదలైన నిధుల్లో 50 శాతం తాగునీటి అవసరాలకు, 50 శాతం పారిశుద్ధ్యానికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. బేసిక్ గ్రాంట్ కింద విడుదలైన నిధులు సీసీరోడ్లు, డ్రైన్లు, ఇతర మరమ్మతులకు వినియోగించుకుంటారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

ఆర్థిక సంఘం నిధులు రాలేదు



ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం లేదు. దీంతో గ్రామాల్లో చిన్న చిన్న పనులు కూడా చేసుకోలేని పరిస్థితి నెలకొంది. వీధి లైట్ల మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు చేపట్టలేని పరిస్థితి ఉంది. అయినా సొంత డబ్బు పెట్టుకుని పనులు చేస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలి.

–ఉషారాణి, సర్పంచ్, పెద్దపొదిళ్ల

సొంత నిధులతో పనులు చేస్తున్నాం



వెంగళాంపల్లితో పాటు పంచాయతీ పరిధిలోని ఓబులదేవరపల్లి గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. సొంత నిధులతో వెంగళాంపల్లి గ్రామంలో 22 వీధి లైట్లు అమర్చాను. తరచూ బోర్లు, మోటర్ రిపేర్లు చేయించాలంటే సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నాను. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో కొత్తగా పైప్‌లైన్ వేశాను.

– రంగస్వామి, సర్పంచ్, వెంగళాంపల్లి

వర్షాకాలంలో జాగ్రత్తలు అవసరం

అవుకు(కొలిమిగుండ్ల): వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అవుకు ట్రాన్స్‌కో ఏఈ ఫక్కీరయ్య మంగళవారం సూచించారు. వాన కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు, ఇతర పరికరాల వద్దకు వెళ్లరాదన్నారు. తడి చేతులతో ఎట్టి పరిస్థితుల్లో స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయవద్దన్నారు. వర్షాకాలంలో ఇళ్ల వద్ద ఇనుప, సిమెంట్ రాడ్లు, టిన్ షీట్లు బహిరంగ ప్రదేశాల్లో ఉంచడం మంచిది కాదని చెప్పారు. పిల్లలను స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆటలు ఆడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

చౌడేశ్వరి ఆలయానికి రూ.50వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరి ఆలయాభివృద్ధికి మంగళవారం ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మేరువ గిరిష్‌బాబు, అనితఖన్నా దంపతుల కుమార్తె మేరవ రిషికా, కుటుంబ సభ్యులు రూ.50,0116 విరాళాన్ని అందజేసినట్లు పీవీ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు దాతలను ఆలయ అర్చకులు సన్మానించి తీర్థప్రసాదం అందజేశారు.

క్లుప్తంగా

ఇష్టంతో చదివితేనే ఉత్తమ ఫలితాలు



భవనాలను పరిశీలిస్తున్న ఎంపీపీ, ప్రిన్సిపల్

బేతంచెర్ల: తల్లిదండ్రుల ఆకాంక్ష మేరకు విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని శేషారెడ్డి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి సూచించారు. వర్షాల నేపథ్యంలో మంగళవారం పాఠశాలలో జరుగుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాల భవనాలను పరిశీలించారు. భవనాలపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

సబ్‌జైల్ ఖైదీలకు ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న సబ్‌జైల్ సూపరింటెండెంట్ సురేష్

డోన్ : అనురక్షిత శృంగారం, కలుషిత సిరంజీల ద్వారా రక్తం ఎక్కించడం వంటివి ఎయిడ్స్ వ్యాధి సంక్రమణకు ప్రధాన కారణాలని సబ్‌జైల్ సూపరింటెండెంట్ సురేష్ తెలిపారు. హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సబ్‌జైల్‌లో రిమాండ్ ఖైదీలకు ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ం ప్రభుత్వ ఆసుపత్రులలో ఏఆర్‌టీ విభాగం ద్వారా ఎయిడ్స్ పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నారని వివరించారు. ఎయిడ్స్ నియంత్రణ మండలి మార్గదర్శకత్వంలో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. సంస్థ ప్రతినిధులు మధుకుమార్, రాజేశ్వరి, సుధాకర్, సబ్‌జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



నెప్స్, డాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

బేతంచెర్ల : జ్ఞాపకాలను పదిలపరచుకోవాలన్నా, గతించిన కాలాన్ని కళ్లముందు సాక్షాత్కరించాలన్నా కెమెరానే సాధనం అని ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు చిన్ని కృష్ణ, కార్యదర్శి శేషు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కెమెరాను సృష్టించిన ఫ్రాన్స్‌కు చెందిన జోసఫ్ నెప్స్, ఇంగ్లాండ్‌కు చెందిన లూయిస్ డాగురే, టాల్‌బెట్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధు, షేక్షావలి, ఆనంద్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు సత్కారం



ఫొటోగ్రాఫర్ ముక్తార్‌ను సత్కరిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

డోన్: వంద అర్థాలను ఒక ఫొటో చెబుతుందని రోటరీక్లబ్ అధ్యక్షుడు జింకల కృష్ణ, కార్యదర్శి బలరాం పేర్కొన్నారు. డోన్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ ముక్తార్‌ను సత్కరించారు. రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్‌గా అవార్డు అందుకున్న దశరథ రామిరెడ్డిని సత్కరించారు. సభ్యులు శివశంకర్‌గౌడ్, రాజా విజయ్‌కుమార్, జగన్మోహన్, డిష్ రఫి, సంగాల నాగరాజు, లక్ష్మిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లా రెడ్డి, ఎల్‌ఐసి శంకర్‌గౌడ్, గౌండ షా పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

డోన్ టౌన్: ఫొటోగ్రఫీ మానవ జీవితాన్ని ప్రతిబింబించే అద్భుత కళ, ఇది కేవలం వృత్తి మాత్రమే కాక శ్రద్ధతో కూడిన సేవ అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, డోన్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీవో హాల్‌లో మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శరత్ స్టూడియో భాస్కర్, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా రాము శర్మ, సహాయ కార్యదర్శిగా రామయ్య, కోశాధికారిగా గుండాల జగన్‌తో పాటు ఇతర సభ్యులు ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

డోన్ టౌన్: మండలంలోని దేవరబండ సబ్‌స్టేషన్ పరిధిలోని మిద్దేపల్లె ఫీడర్ కింద రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 11 కేవీ పనులు జరుగుతున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మిద్దేపల్లె, అనుంపల్లి, రేగులకుంట, దేవరబండ గ్రా మాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు త్రీఫేజ్ విద్యుత్‌ను తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు, మరలా సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అందిస్తామని పేర్కొన్నారు.

చవితి ఉత్సవాల్లో డీజేలు వాడొద్దు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల: పట్టణంలో ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాలను డీజేల వాడకానికి స్వస్తి పలుకుతూ, సంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరి ప్రసాద్, చైర్మన్ చలం రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ, విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ నాగమణి, కేంద్ర గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు గౌరి హుసేన్‌రెడ్డి పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూం.. విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ నెల 30వ తేదీ నిమజ్జనం రోజున తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలన్నారు. గత 37 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని కాపాడుతూ, శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను విజయవంతంగా జరుపుకునేందుకు అందరూ సహకరించాలని కేంద్ర గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు గౌరి హుసేన్‌రెడ్డి కోరారు. వినాయక ఘాట్ అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్ చలం రెడ్డి హామీ ఇచ్చారు.విద్యుత్ ఏఈ మధుసూదన్‌రెడ్డి, ఈఓఆర్డీ మల్లికార్జున, ఉత్సవ కమిటీ సభ్యులు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, హరి, నాగమోహన్, వీరారెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



తహసీల్దార్, నగర పంచాయతీ కమిషనర్, చైర్మన్‌కు విన్నవిస్తున్న కాలనీవాసులు

బేతంచెర్ల: తాగునీటి సమస్యను పరిష్కరించాలని పట్టణంలోని జంగాలపేట కాలనీ వాసులు తహసీల్దార్ నాగమణి, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. 10 రోజులకు ఒక్కసారి మాత్రమే తాగునీరు వస్తోందని వాపోయారు. రెండు నెలలుగా సమస్య నెలకొందని.. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అలాగే వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్, చైర్మన్ చలంరెడ్డి తెలిపారు. తక్షణమే కాలనీని సందర్శించి సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏఈ మధు తేజా రెడ్డికి సూచించారు. కాలనీవాసులు రోషమ్మ, రామేశ్వరి, నాగేశ్వరమ్మ, సుంకులమ్మ తదితరులు ఉన్నారు.

మహిళలకు అండగా ప్రత్యేక చట్టాలు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

కోవెలకుంట్ల: మహిళలకు అండగా ప్రత్యేక చట్టాలు ఉన్నాయని నంద్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ గౌతమి అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణ శివారులోని వెలుగు కార్యాలయంలో మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 112, పోక్సో యాక్ట్, సైబర్ నేరాలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 1930 గురించి తెలియజేశారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్, వాట్సాప్ కాల్ ద్వారా ఫోన్ చేసి వ్యక్తిగత బ్యాంకు ఖాతా, ఆధార్, ఓటీపీ, తదితర వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని పేర్కొన్నారు. ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి, శక్తి టీం ఏఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

డోన్ టౌన్: ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలు అందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ తిరుపతి ప్రధాన కార్యాలయం టెక్నికల్ డైరెక్టర్ గురువయ్య అన్నారు. మంగళవారం డోన్‌కు వచ్చిన ఆయన స్థానిక డీఈఈ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వ్యవసాయ రంగానికి 30 వేల కనెక్షన్లు మంజూరు చేసినట్లు.. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వివిధ పనుల స్థితిగతులపై ఆరా తీశారు. సమావేశంలో ఎస్‌ఈ సుధాకర్ శర్మ, డీఈఈ కమలాకర్‌రావు, డోన్, బేతంచెర్ల, బనగానపల్లె ఏడీఈలు నాగేంద్ర, మధుసూదన్, మద్దిలేటి, ప్రొటెక్షన్ ఏడీఈ గురు లింగాచారి, ఏఈలు నాగేశ్వరరెడ్డి, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



రోడ్డుపై నిల్వ చేరిన వర్షపునీరు

వర్షం వస్తే ఇంతే..!

అవుకు(కొలిమిగుండ్ల): రెండు వైపులా ఎత్తుగా ఉన్న రోడ్డు.. లోతట్టులో సీసీరోడ్డు ఉండడంతో వర్షం కురిసిన ప్రతిసారీ వర్షపునీళ్లు నిల్వ చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బెలుం శింగవరం నుంచి ఆకుమళ్ల ప్రధాన రహదారిలో అవుకు మండలం సుంకేసుల క్రాస్ రోడ్డు సమీపంలో ఈ పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసిన సమయంలో సమీపంలోని పొలాల నుంచి నీళ్లు పెద్ద ఎత్తున ప్రవహిస్తుంటాయి. ఈమార్గంలో అవుకు, కొలిమిగుండ్ల మండలాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వాహనదారులు కోవెలకుంట్లకు వెళుతుంటారు. రోడ్డు పూర్తిగా తగ్గు ఉండడంతో నీళ్లు చేరి అసౌకర్యంగా మారింది. రాత్రిళ్లు వేగంగా వచ్చే వాహనదారులు ఇక్కడికి వచ్చే సరికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈమార్గంలో చాలా చోట్ల రోడ్డు కూడా గుంతలు ఏర్పడ్డాయి.

పింఛన్ల తొలగింపు అన్యాయం



డోన్‌టౌన్: ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన



ప్యాపిలి: ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

డోన్ టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లను తొలగించడంపై లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం డోన్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, పట్టణంలోని జెడ్పీ గెస్ట్ హౌస్ ఆవరణలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దివ్యాంగుల ఆదరణ సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జాడ్జారి మరియదాస్, ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం. సుభాన్ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. లబ్ధిదారులు మాట్లాడుతూ..ం చంద్రబాబు ఎన్నికల సమయంలో దివ్యాంగుల పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.6 వేల, రూ.10 వేల, రూ.15 వేల వరకు పెంచుతానని హామీ ఇచ్చి నేడు దివ్యాంగుల శాతం తక్కువగా చూపుతూ పింఛన్లను కత్తిరించారని ఆరోపించారు. గతంలో 90 శాతం పైగా దివ్యాంగులుగా గుర్తింపు పొందిన వారికి ఇప్పుడు 40 శాతం చూపించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్లు తొలగించారనే నోటీసులు అందుకున్న లబ్ధిదారులు స్థానిక సచివాలయాలకు వెళితే ఆసుపత్రికి వెళ్లమని, ఆసుపత్రిలో డాక్టర్లు 'మాకు తెలియదు' అంటూ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఆసుపత్రులకు రావడానికి భారీ ఖర్చులు పెట్టి వస్తే కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'మా ఉసురు కూటమి నాయకులకే తగులుతుంది' అంటూ వికలాంగులు శాపనార్థాలు పెట్టారు. తొలగించిన పింఛన్లు వెంటనే పునరుద్ధరించకుంటే ఆందోళనలు చేపడతామని యూనియన్ నాయకులు హెచ్చరించారు.

వైకల్యం శాతం తక్కువగా ఉన్నట్లు నోటీసులు

ప్యాపిలి: అంగవైకల్యంతో బాధపడుతూ పింఛన్లు పొందుతున్న దివ్యాంగులపై ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. ఏదో వంక చూపిస్తూ వారికి వచ్చే పింఛన్‌లో కోత పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు రెండు రోజులుగా నోటీసులు అందుతున్నాయి. దీంతో వారంతా తీవ్ర ఆందోళనకు గురై మంగళవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. సదరం శిబిరంలో తమను అన్ని రకాలుగా పరీక్షించిన తర్వాతనే వైద్యాధికారులు వైకల్యం శాతాన్ని సూచిస్తూ సదరం సర్టిఫికెట్ జారీ చేశారని తెలిపారు. దాదాపు 10–15 సంవత్సరాలుగా దివ్యాంగులుగా పింఛన్ పొందుతున్న తమకు ఇప్పుడు నోటీసులు ఇవ్వడం అన్యాయమని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని యథావిధిగా తమకు వస్తున్న పింఛన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. విశ్వక్రాంతి దివ్యాంగుల మండల సమాఖ్య అధ్యక్షుడు తిరుపతయ్య, సెక్రెటరీ పిక్కిలి వెంకటేశ్వర్లు, సభ్యులు శ్రీనివాసులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఏం పాపం చేశాం

కొలిమిగుండ్ల: పుట్టుకతోనే అవయవాల లోపం కొందరికి, కాళ్లు, చేతులు పని చేయక కుటుంబ సభ్యుల మీదనే ఆధారపడిన వాళ్లు మరి కొందరు. ఏళ్ల తరబడి పింఛన్ తీసుకుంటున్న వీళ్లపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపునకు పాల్పడుతుండడంతో దివ్యాంగులు మండిపడుతున్నారు. మేం ఏపాపం చేశామని.. తమ పింఛన్‌లు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుర్చీలకే పరిమితమైన వాళ్లు, మూడు పదుల వయసు వచ్చినా పసిపిల్లాడిలా మంచానికే పరిమితమైన వాళ్లు ఇలా చాలా మంది దివ్యాంగుల దీన గాథలు ఉన్నాయి. ఏదో ఒక కారణం వెతికి పింఛన్‌ల సంఖ్య తగ్గించేందుకు ప్రభుత్వం ఈపన్నాగం పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అర్హులైన చాలా మంది దివ్యాంగుల పింఛన్‌లు నిలిపివేయడంతో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు మద్దిలేటిరెడ్డి, రామచంద్రుడుతో పాటు పలువురు మంగళవారం ఎంపీడీఓ ప్రసాదరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వెరిఫికేషన్ చేయించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఇటీవల విడుదల చేసిన రీవెరిఫికేషన్ సర్టిఫికెట్లలో కేటగిరీల్లో తప్పులు ఉన్నాయని వాటిని సవరించాలని డిమాండ్ చేశారు.



కొలిమిగుండ్ల: ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు

దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: నియోజకవర్గంలోని డోన్ పట్టణానికి ఒకటి, బేతంచెర్ల నగర పంచాయతీకి మరోటి ఓపెన్ కేటగిరీ కింద కొత్త బార్ల స్థాపనకు గెజిట్ జారీ అయినట్లు డోన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ వరలక్ష్మీ మంగళవారం తెలిపారు. ఈ లైసెన్సులు మూడేళ్ల కాలపరిమితితో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బార్లకు దరఖాస్తు చేసుకోదలచిన వారు రూ.5 లక్షల నాన్ రీఫండబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించి, ఈ నెల 18వ తేదీ నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. 28న నంద్యాలలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు డోన్ ఎక్సైజ్ స్టేషన్ లేదా 9440902584 నంబర్‌ను సంప్రదించవచ్చని సీఐ తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బనగానపల్లె రూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. రోడ్డుకు అనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే అవకాశం ఉందని గుర్తించి వాటిని పక్కకు తరలించేలా విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఘనంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మీర్జాపురంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం చేశారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నాలుగు రోజుల పాటు స్వామి ప్రతిమను కొలువుదీర్చి పూజలు చేశారు. చివరి రోజు గ్రామోత్సవం సందర్భంగా శ్రీకృష్ణుడిని పూలతో అందంగా అలంకరించారు. సీఐ రమేష్‌బాబు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. మేళతాళాల మధ్య గ్రామంలోని వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి త్రైత సిద్ధాంత భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోరెడ్డి రామకృష్ణారెడ్డి, పీఎంహెచ్ నాయుడు, బాలు, భూపాల్ పాల్గొన్నారు.



రామిరెడ్డిపల్లెలో శ్రీకృష్ణుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు


రామిరెడ్డిపల్లెలో..

సంజామల: మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మూడురోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, భగవద్గీత శ్లోకాల పఠనంతో గ్రామోత్సవాన్ని ఘనంగా జరిపారు. సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక రామిరెడ్డిపల్లె కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు వెంకటసుబ్బయ్య, గురు ప్రసాద్, సులోచన, గణపతి, లత, అక్షిత్, అనినాష్, రమణ, ఇందుమతి, హరిత పాల్గొన్నారు.

ఉప్పొంగిన పాలేరు


- నీటమునిగిన పంటలు

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కోవెలకుంట్ల మండలం లింగాల సమీపంలో పాలేరు వాగు సోమవారం రాత్రి నుంచి ఉప్పొంగి ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు తోడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కుందూనదికి భారీగా వరదనీటిని విడుదల చేశారు. పొలాలు, వంకలు, వాగుల్లోని వర్షపు నీరు, కుందూ వరద పోటెత్తడంతో పాలేరు వాగు వంతెనపై వరద నీరు చేరడంతో ఈ రహదారిలో రాకపోకలు స్తంభించిపోయాయి. పాలేరు వాగు పరివాహక ప్రాంతాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి, మినుము, మొక్కజొన్న పంటలు నీటి మునిగిపోయాయి.



ఉప్పొంగి ప్రవహిస్తున్న పాలేరు వాగు

కుందూనది, పాలేరు వాగు పరివాహక ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. విత్తనాలు, రసాయన ఎరువులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు వెచ్చించగా వరద పైర్లను ముంచెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పంటనష్టం అంచనా వేసి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



నీట మునిగిన వరి